

# విశ్వం కథ

- చింతా రాంబాబు

**లైబ్రరీ చాలా నిశ్శబ్దంగా ఉంది. ఓ విధంగా ఆ హాలు క్లాసు రూమును గుర్తుకి తెస్తూంది. ఎవరికి వాళ్ళు నిశ్శబ్దాన్ని పాటిస్తున్నారు. కూర్చున్న వాళ్ళు చేతుల్లోని పత్రికలను తిరగేస్తుంటే, ఏ పత్రిక దొరకని వాళ్ళు వాళ్ళ కుర్చీల వెనుక చేరి ఆ పత్రికల్లోకి తొంగి చూస్తూ పచార్లు చేస్తున్నారు.**

విశ్వం మాత్రం తన చేతిలోని పత్రికను చూడటం మానేసి పక్కతను తిరగేస్తున్న పత్రికకేసి చూడసాగాడు.

అతను పేజీని తిప్పినప్పుడల్లా ఉత్కంఠగా చూడసాగాడు.

కారణం ఆ పత్రికల్లో విశ్వం రాసిన కథ అచ్చు కావటమే! అతనా కథను చదివితే తన కళ్ళతో చూడాలని విశ్వం మనసు ఉవ్విళ్ళూరుతోంది.

పక్కతను 'నేటి రాజకీయం'పై వేసిన కార్టూనులు చదవటం పూర్తి కావటంతో పేజీని తిప్పాడు.

ఆ పేజీలో ఏదో సీరియల్ వుండటంతో రెండు మూడు పేజీలు తిప్పేశాడు.

ఆ తర్వాత పేజీలో కనిపించిన 'డాక్టరు గారి జవాబులు' మాత్రం ఆసక్తిగా చదవసాగాడు.

అవి చదవటానికి అతనికి కనీసం అయిదు పది నిమిషాలు పడుతుంది.

ఈ లోపల ఒక కథ చదువుకొందామని ప్రయత్నించిన విశ్వానికి కథ మీదకి మనసు పోవటం లేదు.

ఎంత త్వరగా అతను తన కథను చదువుతాడా చూడాలని మనసు కొట్టుకుపోతోంది.

ఒక్కసారిగా అతను పేజీలన్నీ తిప్పేసి తన కథను చదవటం ప్రారంభిస్తే బాగుణ్ణనిపించింది కూడా.

కానీ అతను ప్రతి పేజీ, ప్రతి శీర్షికా చాలా ఓపిగ్గా చూసుకొంటూ, చదువుకొంటూ ముందుకి వెళ్తున్నాడు.

అసలు విశ్వానికి ఇలా లైబ్రరీలో కూర్చొని పత్రికలు చదువుకొనే అలవాటు స్కూల్లోనూ, కాలేజీలోనూ చదువుకొనే రోజుల్లో ఉండేది. ఉద్యోగంలో జాయినయ్యాక తీరుబాటులేక, లైబ్రరీ అందుబాటులో లేక అలవాటు పూర్తిగా పోయింది.

ఆ సాయంత్రం ఆ లైబ్రరీ వున్న రోడ్డులోకి ఏదో పని వుండి రావటంతో అప్రయత్నంగా కాళ్ళు రెండూ లైబ్రరీలోకి దారి తీశాయి.

అతను లైబ్రరీలోకి అడుగుపెట్టీ పెట్టంగానే అతని కథ అచ్చయిన పత్రిక కళ్ళబడింది.

దాని తర్వాత పత్రిక కూడా మార్కెట్టులోకి వచ్చేసింది. అయినా ఎందుకో ఇంకా ఆ పత్రిక అలాగే టేబుల్ మీద పడి వుంది.

ఆ పత్రికను చూడగానే విశ్వం మనసులో మెదిలిన భావం భాషకందనిది.

అది సంతోషమో, గర్వమో కూడా చెప్పుకోలేని అనిర్వచనీయమైన అనుభూతి.

ఆ పత్రికను చేతుల్లోకి తీసుకొని ఒక్కసారి తన కథను ప్రేమగా తడిమి చూసుకోవాలనిపించింది.

అలాగే అక్కడ అందరి మధ్య కూర్చొని మళ్ళీ ఒకసారి తన కథను చదువుకోవాలనిపించింది కూడా.

అదే క్షణంలో ఈ పక్క వ్యక్తి రావటం, ఆ పత్రికను అందుకోవటం జరిగిపోయింది.

ఇంక చేసేదిలేక విశ్వం కూడా ఇంకో పత్రికను చేతుల్లోకి తీసుకోవడంతో ఇద్దరూ పక్కపక్కనే కూర్చోవటం జరిగింది.

పక్కతను 'డాక్టరు గారి జవాబులు' చదివేసినట్టున్నాడు. పేజీని తిప్పాడు. ఆ పేజీలో ఓ వర్ధమాన రచయిత రాసిన కథ వుంది.

క్షణంపాటు అతను కథకేసి, ఆ కథకేసిన బొమ్మకేసి పరికించి చూశాడు.

ఏమనుకున్నాడో ఏమో తటపటాయిస్తూనే నాల్గయిదు లైనులు చదివాడు.

అంతే! పేజీని తిప్పెయ్యకుండా ఆసక్తిగా ఆ కథను చదవటం ప్రారంభించాడు.

నిజంగానే ఆ కథ చాలా చక్కటి కథ. తనకు కూడా చాలా బాగా నచ్చింది. అందుకే పత్రికలో మొదటి కథగా ప్రచురించారనిపించింది.

అలాగే అతను తన కథని కూడా చదివితే కథ పూర్తయ్యాక అతని పెదాలపై విరిసిన దరహాసాన్ని, మొహంపై మెదిలిన భావాన్ని చూడాలని విశ్వం ఆరాటం.

కథ చదవటం పూర్తయ్యాక అతను తృప్తితో కూడిన ఓ

నిట్టూర్పు విడిచాడు. ఓ మంచి కథ చదివానన్న భావం అతని మొహంలో స్పష్టంగా కనిపించింది విశ్వానికి.

ఆ తర్వాత కథను అతను నాల్గయిదు లైనులు చదవగానే ఎందుకోమొహం చిట్లించాడు. కష్టంగానే ఇంకో నాల్గయిదు లైన్లు చదివాడు. అంతే! అసహనంగా వెంటనే పేజీని తిప్పేశాడు.

అలాగే తర్వాత కథను కూడా నాల్గయిదు లైనులు చదవగానే పేజీని తిప్పేశాడు.

ఈసారి విశ్వం గుండె గుటుక్కుమంది.

ఈ విధంగా చూస్తే అతను తన కథను చదువుతాడని గ్యారంటీ ఏముంది?

అతను చదివే తీరునిబట్టి సాహిత్యం మీద కొద్దోగొప్పో అవగాహన వున్న వ్యక్తి లాగానే కనిపిస్తున్నాడు.

''కథ చివర్లో వేసినా అన్ని కథల్లోకి మీ కథే బాగుందండీ!'' అని భార్య అనటం జరిగింది.

అలాగే మిత్రులు కూడా తన కథ ''చాలా సహజంగా ఆకట్టుకునేటట్టు''గా వుందన్నారు.

తనను సంతోషపర్చాలన్న భావంతో భార్య ఆ మాట అని వుండవచ్చును.

అలాగే తనను రచయితగా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మిత్రులు అలా మెచ్చుకొని వుండవచ్చును.

ఇక్కడ ఈ కూర్చొన్న పాఠకుడికి ఆ కథ రాసిందెవరో తెలియదు.



- కథ బాగుంటే చివరికంటా చదువుతాడు. లేకపోతే తన కళ్ళ ముందే నిర్దాక్షిణ్యంగా పేజీని తిప్పేవాడు.

విశ్వం రాసిన కథలు అప్పుడప్పుడు పత్రికల్లో వస్తుంటాయి. ఎప్పుడూ అతనికిలాంటి అనుభవం ఎదురు కాలేదు.

అప్పటికి అతను నాలుగు కథల్లో ఒక్కటి మాత్రమే పూర్తిగా చదివాడు.

మిగిలిన మూడు కథలూ తిప్పేశాడు.

ఆ తర్వాత వచ్చే కథే తన కథ!

పత్రికల్లో అది చివరి కథ కూడా!

విశ్వానికి చాలా ఉద్వేగంగా ఉంది. అతను తన కథను చదువుతాడా, లేడా? చదివినా చివరికంటా చదువుతాడా? లేక పేజీని తిప్పేస్తాడా?

విశ్వానికి లోపల చెప్పలేనంత ఆత్రుతగా వుంది.

'నా సాహసం' శీర్షికన పాఠకులు చేసిన సాహసాలను చదువుతున్నాడతను.

ఆ పేజీకి వెనుకనే వుంది తన కథ.

విశ్వం అలాగే ఊపిరి బిగబట్టి అతనికేసి, అతని చేతిలోని పత్రికకేసి చూడసాగాడు!

అలాంటి సాహసాలు జీవితంలో తను కూడా ఒకసారి చేసి వుంటే ఎంత బాగుణ్ణు అన్నట్టుగా చదువుతున్నాడతను.

ఇక్కడ విశ్వం గుండె కొట్టుకోవటంలోని వేగం క్షణక్షణానికి పెరిగిపోసాగింది.

అతను శీర్షిక చదవటం పూర్తి కావటంతో పేజీని తిప్పాడు.

అదిగో వచ్చేసింది తన కథ!

అదే తన కథ!!

విశ్వం ఊపిరి పీల్చటం పూర్తిగా మర్చిపోయాడు. అదే క్షణంలో 'టక్‌టక్'మని లైట్లు ఆరిపోవటం, ''లేవండిసార్! టైమయింది'' అన్న కేక వినబడింది.

క్షణం సేపు విశ్వంలోని రచయిత 'గిలగిల్లాడి'పోయాడు.

చెప్పినా లేవరని టైముకి అలా లైట్లు తీసెయ్యటం లైబ్రరీల్లో సర్వ సాధారణం.

అదే 'విశ్వం కథ' పాలిట శాపమైంది.

